క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ వైర్ల మరమ్మతుల దృష్ట్యా ముత్యాలంపాడు సెక్షన్ భగత్‌సింగ్‌రోడ్డు ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.
శ్రీనగర్‌కాలనీ మెయిన్‌రోడ్డు, జండాచెట్టు ఏరియా, భగత్‌సింగ్‌రోడ్డు, మెయిన్‌రోడ్డు, కృష్ణ అపార్ట్‌మెంట్ రోడ్డు, గంగానమ్మగుడి ఏరియా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఆయన పేర్కొన్నారు.

నేడు డయల్ యువర్ పోలీస్ కమిషనర్

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణాతో నేరుగా ప్రజలు మాట్లాడేందుకు ప్రతి శుక్రవారం డయల్ యువర్ సీపీ కార్యక్రమం నిర్వహిస్తున్నారని కమిషనర్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్యలో 0866–2490613 నంబర్‌కు ఫోన్ చేసి ప్రజలు తమ సమస్యలను నేరుగా సీపీకి తెలియజేయాలని సూచించారు.

బుడమేరులో గుర్రపు డెక్క తొలగింపు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దావు బుచ్చయ్యకాలనీ బుడమేరులో గుర్రపు డెక్క తొలగింపు పనులు గురువారం జరిగాయి. బుధవారం కురిసిన వర్షానికి కొట్టుకు వచ్చిన గుర్రపు డెక్కను నగరపాలక సంస్థ సిబ్బంది బోటు సహాయంతో తొలగించారు. బుడమేరులో చెత్త చెదారం వేయడంతో నీటి ప్రవాహం నిలిచిపోయి దోమలు విజృంభిస్తాయని, తద్వారా డెంగ్యూ మలేరియా లాంటి అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని పారిశుద్ధ్య సిబ్బంది తెలిపారు.

దాసాంజనేయస్వామి హుండీ ఆదాయం రూ. 10.79 లక్షలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయంలో 113 రోజులకు గానూ భక్తులు హుండీల ద్వారా స్వామివారికి సమర్పించిన కానుకల ఆదాయం రూ. 10,79,540 వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారిణి నాగిరేని భవాని తెలిపారు. దేవదాయశాఖ శ్రీ గుంటూరు సీతారామయ్య ధర్మసత్రం కార్యనిర్వహణాధికారి ఎస్.ఆంజనేయస్వామి, ధర్మకర్తల మండలి ఛైర్మన్ కనపర్తి కొండలరావు పర్యవేక్షణలో హుండీ లెక్కింపు గురువారం ఉదయం జరిగింది. హుండీ లెక్కింపులో ఆలయ ధర్మకర్తలు, సేవా సంఘం సభ్యులు, భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించి పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): జాతీయ న్యాయ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని జయహో వాకర్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఆధ్వర్యంలో సత్యానారాయణపురంలోని ఏకేటీపీ మున్సిపల్ హైస్కూల్లో చట్టాలపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. న్యాయవాది రాజకుమారి పాల్గొని చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా మైనర్లపై జరుగుతున్న దాడులు, పోక్సో చట్టం గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం క్లబ్ ప్రెసిడెంట్, న్యాయవాది కె.జయశ్రీ మాట్లాడుతూ మైనర్లపై వేదింపులు, అసభ్య ప్రవర్తన, ఫోటోలు తీయడం, మార్ఫింగ్ చేయడం, సోషల్ మీడియాలో పెట్టడం, ప్రేమ, పెళ్ళి పేరుతో మోసం చేయడం తీవ్ర నేరాలుగా పరిగణించబడుతాయని పేర్కొన్నారు. పోక్సో చట్టం ప్రకారం కఠిన శిక్షలు విధించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జయహో వాకర్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ సభ్యులు సీహెచ్ రమాదేవి, బి.ఆంజనేయరెడ్డి, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ప్రభాకరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రావీణ్యం పెంపొందించుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు విద్యతో పాటు క్రీడలలో ప్రావీణ్యం పెంపొందించుకోవాలని క్రీడల వల్ల శారీరక ధారుడ్యంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందని సెయింట్ ఆన్స్ స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ ఆశాజార్జి, కరస్పాండెంట్ జెస్సీ థామస్ అన్నారు. స్థానిక అజిత్‌సింగ్‌నగర్ సెయింట్ ఆన్స్ స్కూల్లో జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో విజయకేతనం ఎగురవేసిన పాఠశాల విద్యార్థుల అభినందన కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 4, 5, 6 తేదీల్లో జంషెడ్‌పూర్‌లో జరిగిన జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో అండర్ 14 విభాగంలో కె.అభిషేక్‌కుమార్, ఎం.సిద్ధిక్‌హుస్సేన్, శ్రీ చైతన్యదాస్‌లు ప్రథమస్థానం, అండర్ 17లో దిల్షాన్, కె.శాంతి, సంపత్‌కుమార్, ఎస్కే పర్షత్‌లు తృతీయ స్థానం సాధించారన్నారు. ఇదే స్ఫూర్తితో మరింత మెరుగైన ప్రదర్శనతో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులను ఘనంగా సత్కరించారు.

వ్యక్తి అదృశ్యం

పాయకాపురం(విజయవాడరూరల్): ఆటోకి అని వెళ్ళిన తన కుమారుడు రెండు రోజులుగా ఇంటికి రాలేదని తల్లి నున్న పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాలు, కండ్రికకు చెందిన మొండితోక సురేంద్ర కుమార్(40) ఆటో నడుపుతుంటాడు. అతనికి భార్య ఇద్దరు పిల్లలున్నారు. ఆటోకని ఇంటి నుంచి ఈ నెల 7న వెళ్ళిన వ్యక్తి తిరిగి రాలేదని అతని తల్లి పుష్ప పోలీసు స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

99.5 శాతం హామీల అమలు



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ శైలజ తదితరులు



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో నాలుగున్నరేళ్లుగా సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగిస్తూ.. 99.5శాతం హామీలు అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. నియోజకవర్గంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం 26వ డివిజన్ మారుతీనగర్‌లో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి ఆయన ప్రారంభించారు. తొలుత ర్యాలీగా వెళ్లి మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం 29వ వార్డు సచివాలయ పరిధిలో మొత్తం సంక్షేమ పథకాల లబ్ధిదారుల సంఖ్య, ప్రతి పథకానికీ పంపిణీ చేయబడిన మొత్తాన్ని హైలైట్ చేస్తూ 'సంక్షేమ పథకాల బోర్డు'ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. నాలుగున్నరేళ్లలో జగనన్న ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, సాధించిన విజయాలను ప్రజలకు వివరించే కార్యక్రమమే 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..' అని ఈ సందర్భంగా మల్లాది విష్ణు తెలిపారు. విద్య, వైద్యం, గృహ నిర్మాణం, వ్యవసాయం, పరిశ్రమలు, జీఎస్‌డీపీ, తలసరి ఆదాయం, ఉద్యోగాల కల్పన, ఇలా 20 అంశాలను ప్రజల ముందు పెట్టబోతున్నట్లు తెలిపారు. 29వ వార్డు సచివాలయ పరిధిలో డీబీటీ ద్వారా 1,729 మందికి రూ. 5.7 కోట్ల లబ్ధి చేకూర్చగా నాన్ డీబీటీ ద్వారా 719 మందికి రూ 1.01కోట్లు మేలు చేకూర్చడం జరిగిందని వెల్లడించారు. మొత్తంగా 2,448 మందికి రూ. 6.70 కోట్ల లబ్ధి చేకూర్చినట్లు వివరించారు. కనుకనే ప్రజలందరూ ముక్తకంఠంతో జగనన్నే మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు.

జగనన్నకి ధన్యవాదాలు:
కొచ్చర్ల లక్ష్మి అనే లబ్ధిదారు మాట్లాడుతూ.. అమ్మ ఒడి, విద్యాదీవెన పథకాలతో పిల్లలకు పూర్తి ఉచితంగా ఉన్నత చదువు అందుతోందన్నారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా ఇంటి వద్దకే పింఛన్ అందిస్తున్నారని.. తన కుటుంబానికి వెన్నుదన్నుగా నిలిచిన జగనన్నకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ డివిజన్ ఇంఛార్జి అంగిరేకుల నాగేశ్వరరావు, డివిజన్ కోఆర్డినేటర్ కె.నాగాంజనేయులు, కార్పొరేటర్లు, డివిజన్ ఇంఛార్జిలు, కోఆర్డినేటర్లు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా..

మధురానగర్(విజయవాడసెంట్రల్): జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించారని, ఆరోగ్యశ్రీతో నిరుపేదలకు సైతం కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్నారని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక 29వ డివిజన్ మధురానగర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే విష్ణు కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతితో కలిసి జగనన్న సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పేదల ఆరోగ్యాన్ని గాలికొదిలేసిందని సీఎం జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు. కోవిడ్ సమయంలో కూడా దేశంలోనే ఎక్కడాలేని విధంగా ఆరోగ్య సేవలు అందించామని గుర్తు చేశారు. అనంతరం వైద్య పరీక్షలను స్వయంగా పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర మహిళ అధ్యక్షురాలు పిల్లి కృష్ణవేణి, నగర అధికార ప్రతినిధి కంభం కొండలరావు పాల్గొన్నారు.



29వ డివిజన్‌లో జగనన్న సురక్ష వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మల్లాది విష్ణు

500 మందికి వైద్య పరీక్షలు....
27వ డివిజన్ దుర్గాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరితో కలిసి మల్లాది విష్ణు ప్రారంభించారు. సుమారు 500 మంది వైద్య శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ వర్మ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, వార్డు సచివాలయం సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

32వ డివిజన్‌లో....
32వ డివిజన్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ డివిజన్ ఇంఛార్జి గుండే సుందర్‌పాల్‌తో కలిసి ఎమ్మెల్యే మల్లాది గురువారం ప్రారంభించారు. స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేశారు.వైఎస్సార్ సీపీ నాయకులు పేరం త్రివేణిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

63వ డివిజన్‌లో...
పాయకాపురం(విజయవాడరూరల్): 63వ డివిజన్ విశాలాంధ్ర కాలనీ, గాయత్రీ హైస్కూల్లో నిర్వహించిన వైద్య శిబిరంలో ఎమ్మెల్యే విష్ణు గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క రూపాయి ఖర్చులేకుండా బీపీ, షుగర్, కంటి పరీక్షలు, ఈసీజీ లాంటి ముఖ్యమైన వైద్య పరీక్షలు చేయడంతో పాటు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతోందని పేర్కొన్నారు. ప్రజలందరూ ప్రభుత్వం అందించే వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 277వ వార్డు సచివాలయం పరిధిలో 1275 మంది వైద్య సేవలను వినియోగించుకున్నారు. అనంతరం రోగులకు మందులను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మ, వైద్యులు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

36వ డివిజన్‌లో....
గాంధీనగర్(విజయవాడసెంట్రల్): 36వ డివిజన్ 196వ వార్డు సచివాలయ పరిధిలోని రామకోటి మైదానంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం గురువారం జరిగింది. వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే మల్లాది విష్ణు స్థానిక కార్పొరేటర్ బాలి గోవింద్‌తో కలిసి ప్రారంభించారు. ఆరోగ్యాంధ్రను నిర్మిద్దామంటూ రూపొందించిన బ్యానర్‌పై ఎమ్మెల్యే విష్ణు సంతకం చేశారు. శిబిరంలో పాల్గొన్న వారిని వైద్య పరీక్షల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వాంబేకాలనీలో....
అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): 60వ డివిజన్ 267వ వార్డు సచివాలయ పరిధిలోని వాంబేకాలనీ జీ బ్లాక్‌లో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రారంభించారు. వైద్య శిబిరంలో వైఎస్సార్ సీపీ నాయకులు బెవర నారాయణ, బత్తుల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పొదుపు అలవర్చుకోవాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సమాఖ్య సభ్యులు ప్రతి ఒక్కరూ పొదుపు అలవర్చుకోవాలని మెప్మా టీఈ ఫణికుమార్ అన్నారు. గవర్నర్‌పేటలోని ఐవీ ప్యాలెస్‌లో మెప్మా ఆధ్వర్యంలో 'శుభోదయం' పట్టణ మహిళా సమాఖ్య కార్యవర్గ 3వ మహాజన సభ సమావేశం గురువారం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాఖ్య సభ్యుల అంతర్గత అప్పులు, శిక్షణ, జీవనపాధులను వివరించారు. 'శుభోదయం' పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కె.మీనాక్షి మాట్లాడుతూ ప్రతి సభ్యురాలు సమైక్యకు పొదుపులు సక్రమంగా చెల్లించాలన్నారు. సమాఖ్యలు, పట్టణ సమాఖ్యలు పొదుపు చెల్లిస్తూ ఆ డబ్బులను లోన్ రూపంలో తీసుకొని జీవనోపాదికి ఉపయోగించుకోవాలని సూచించారు. అర్హత కలిగిన సమాఖ్య సభ్యులందరికీ శుభోదయం పట్టణ మహిళా సమాఖ్య రుణాలు మంజూరు చేస్తుందని తెలిపారు. యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ డి.జైపాల్, పి.రమ్యకృష్ణ, డి.శేఖర్, సుల్తానాఆరిఫా, మహాలక్ష్మి, పుణ్యవతి, డి.గీతాంజలి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

స్వరరాగ రంజితం అశ్వత్థ నారాయణన్ గాత్రం



విజయవాడ కల్చరల్: శ్రీ సద్గురు సంగీత సభ 30వ వార్షికోత్సవం సందర్భంగా దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాలలో గురువారం నిర్వహించిన అశ్వత్థ నారాయన్ గాత్ర సంగీత సభ స్వరరాగ రంజితంగా సాగింది. సదాబాల రూపం, శోభిల్లు సప్తస్వర, దేవ దేవ జగదీశ్వర, బ్రోచేవారెవరురా, దేవీ బ్రోవ సమయమిదే, తదితర కీర్తనలను మధురంగా ఆలపించారు. వయోలిన్‌పై ఆర్ దినకరన్, మృదంగంపై బుర్రా శ్రీరాం, ఘటంపై హనుమంతరావు సహకరించారు. సంగీత కార్యక్రమాలను శ్రీ ధాత్రి ఆర్థోపెడిక్, మెటర్నిటీ, గైనకాలజీ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ కేబీఎస్ శ్రీనివాస్, డాక్టర్ లలితామాధవి, డాక్టర్ అనిరుద్ ప్రారంభించారు. నిర్వాహకులు సంగీత కళాకారులను అతిథులను సత్కరించారు. శ్రీసద్గురు సంగీత సభ అధ్యక్షుడు బీవీఎస్ ప్రకాష్, ఉపాధ్యక్షుడు జే ప్రభాకరశాస్త్రి, గాయత్రీ గౌరీనాథ్ పాల్గొన్నారు. నేటి కార్యక్రమాలు సాయంత్రం 7.30 ప్రారంభమవుతాయి.

పేద బడుగు, బలహీన వర్గాలకు అండగా ప్రభుత్వం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పేద బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 58వ డివిజన్ 260వ వార్డు సచివాలయ పరిధిలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019కి ముందు, తర్వాత అన్న విధంగా పరిపాలనలో సీఎం వైఎస్ జగన్ విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. ప్రభుత్వ చర్యలతో రాష్ట్రంలో పేదరికం 11.77 శాతం నుంచి 6.06 శాతానికి తగ్గిందని తెలిపారు.



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గడప గడపకూ వెళ్లే ధైర్యం టీడీపీకి ఉందా..?
టీడీపీ హయాంలో ప్రజలకు ఇంత మేలు చేశామని గడప గడపకూ వెళ్లి చెప్పే ధైర్యం చంద్రబాబుకు, టీడీపీ నేతలకు ఉందా? అని మల్లాది విష్ణు ప్రశ్నించారు. రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ, జనసేన చేస్తున్న కుట్ర రాజకీయాలను ప్రజలందరూ గమనిస్తున్నారని 2024లోనూ ఈ పార్టీలకు మరోసారి గట్టిగా బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, అఫ్రోజ్, వెంకట్రావు, వసంత్, గోపాలరెడ్డి, శర్మ, వలి, వజీర్, తోపుల వరలక్ష్మి, మారుతి, శోభన్, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనల మేరకే టీడీఆర్ బాండ్లు

మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనల ప్రకారం జరుగుతున్న నిర్మాణలకు మాత్రమే టీడీఆర్ బాండ్స్ ఇస్తామని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోగల కమాండ్ కంట్రోల్ రూమ్‌లో గురువారం టీడీఆర్ బాండ్స్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కమిటీ చైర్మన్‌గా ఉన్న ఆయన నిర్వహించిన సమీక్షలో రీజనల్ డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (రాజమహేంద్రవరం), విజయవాడ సెంట్రల్, నార్త్, ఈస్ట్, వెస్ట్ నియోజకవర్గాల తహసీల్దార్లు అరుణ వల్లి, వెన్నెల శ్రీను, ఎం.మాధురి, వెంకట రామయ్య, పి.జాహ్నవి, డెప్యూటీ కమిషనర్ విజయవాడ నగర పాలక సంస్థ (రెవెన్యూ) డి.వెంకట లక్ష్మి, గాంధీనగర్ జాయింట్ సబ్ రిజిస్ట్రార్లు ప్రసాద్ (గాంధీనగర్), కృష్ణప్రసాద్ (గుణదల), శ్రీచైతన్య (పటమట), డైరెక్టర్ టౌన్ ప్లానింగ్ ఏపీ సీఆర్‌డీఏ విజయవాడ ఎం వెంకట సుబ్బయ్యలతో ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కమిటీని ఏర్పాటు చేశారు. ఇకపై ట్రాన్స్‌పరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) ఇవ్వాలన్నా, అంతకు ముందు పెండింగ్‌లో ఉన్న టీడీఆర్ బాండ్లు కచ్చితంగా ఈ కమిటీ పరిశీలించిన తరువాతే ఇవ్వాలని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కమిటీ ముందు 15 ప్రతిపాదనలు పెట్టారు. ప్రతి 15 రోజులకు జరిగే సమీక్షా సమావేశంలో వచ్చిన ప్రతిపాదనలకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారికి టీడీఆర్ బాండ్లు ఇవ్వటం జరుగుతుందన్నారు. ప్రతిపాదించిన 15 అభ్యర్థనలు ప్రభుత్వ నిబంధనల మేరకు ఉన్నాయా లేదా అన్నది కమిటీ సభ్యులు పరిశీలించిన తరువాత సమావేంలో సిఫార్స్ చేస్తారని తెలిపారు.



సమావేశంలో కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అబుల్ కలాం ఆజాద్ జయంతి ఉత్సవాలకు ఏర్పాట్లు

స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ సంపత్‌కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 11వ తేది నిర్వహించనున్న భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి ఉత్సవాలకు త్వరితగతిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. స్టేడియంలో ఉత్సవాల ఏర్పాట్లను కలెక్టర్, జేసీ డాక్టర్ పి.సంపత్‌కుమార్, మున్సిపల్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సబ్ కలెక్టర్ అదితి సింగ్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అబుల్ కలాం జాద్ జయంతి ఉత్సవాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటారని చెప్పారు. ఏర్పాట్లలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఉత్సవాలకు 5 నుంచి 6 వేల మంది ముస్లిం మైనార్టీలు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. ప్రధాన వేదిక నిర్మాణంతో పాటు రాష్ట్ర ఉన్నతాధికారులు, రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసన మండలి సభ్యులు, శాసనసభ్యులు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు ఆశీనులయ్యేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. అబుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ఒకరికి జాతీయ పురస్కారంతో పాటు 8 మందికి అబుల్ కలాం లైఫ్ టైమ్ అఛీమెంట్ అవార్డులు, 78 ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు, 78 మందికి ఉత్తమ విద్యార్థి అవార్డులు రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదగా అందజేస్తామని వెల్లడించారు. జాబితా ప్రకారం అవార్డు గ్రహీతలకు ముందుగానే సమాచారం అందించి వారికి కేటాయించిన స్థానాల్లో ఆశీనులు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పార్కింగ్ సౌకర్యం, పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు సూచించారు. ఏర్పాట్లు పరిశీలించిన వారిలో ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ మస్తాన్ వలి, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి షాహి ఉన్నీషా బేగం, ట్రాన్స్ కో ఈఈ సుధాకర్, పోలీస్ అధికారులు ఉన్నారు.



ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు తదితరులు

పశు వైద్యశాల భవనం పునఃప్రారంభం

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక ముత్యాలంపాడులో దాతల సహకారంతో ఆధునీకరించిన ముత్యాలంపాడు పశువైద్యశాల ప్రారంభోత్సవం గురువారం జరిగింది. ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొన్నారు. ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి, 31వ డివిజన్ కార్పొరేటర్ పెనుమత్స శిరీషతో కలిసి ఎమ్మెల్యే విష్ణు పశువైద్యశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన పశు వైద్యశాలను దాతలు స్థానిక కార్పొరేటర్ పెనుమత్స శిరీష, పెనుమత్స సత్యం సహకారంతో ఆధునీకరించి అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. పశు వైద్యశాల ఆధునీకరణకు కృషి చేసిన వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ జీ రామకృష్ణను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పరంగా మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి మాట్లాడుతూ అన్నిరకాల పశువైద్య సేవలు మరింత మెరుగ్గా అందించాలని సూచించారు. ఇక నుంచి పశువులు, కుక్కలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడు డాక్టర్ కె.విద్యాసాగర్, డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ గోపీచంద్, డాక్టర్ సాయిగోపాల్, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.



ముత్యాలంపాడులో పశువైద్యశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విష్ణు, గౌతంరెడ్డి, శిరీష

పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): విద్యార్థులు పాఠశాలలోని పాఠ్యపుస్తకాలతో పాటు గ్రంథాలయాలను సందర్శించి అక్కడ లభ్యమయ్యే విలువైన పుస్తకాలను పఠనం చేయడం ద్వారా ఎంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణిమూర్తి పేర్కొన్నారు. ఈ నెల 14 నుంచి 20 వరకు జరిగే గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో ఆయన చేతుల మీదుగా వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శర్వాణిమూర్తి మాట్లాడుతూ చిన్న వయస్సు నుంచే విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తి కలిగించేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సాహించాలని కోరారు. ఈ వారోత్సవాల సందర్భంగా గ్రంథాలయంలో ప్రాథమిక, హైస్కూల్, జూనియర్ కళాశాల విద్యార్థులకు వివిధ అంశాలలో నిర్వహించే వ్యాసరచన, డిబేట్, క్విజ్, చిత్రలేఖనం, క్రీడా పోటీలలలో ఉత్సాహంగా పాల్గొనాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పి.సంపత్‌కుమార్, సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ శర్వాణిమూర్తి

టేబుల్ టెన్నిస్‌లో నగర విద్యార్థులకు పతకాలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఈ నెల 4, 5 తేదీల్లో గుంటూరులోని జెమ్ స్కూల్ ఆవరణలో జరిగిన 67వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్–14,17,19 పోటీల్లో పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో శిక్షణ తీసుకున్న విద్యార్థులు కృష్ణా జిల్లా తరపున పాల్గొని వివిధ విభాగాల్లో పతకాలు పొందారని కోచ్‌లు దామోదర్ రెడ్డి, భార్గవి తెలిపారు. పతకాలు పొందిన విద్యార్థులను చెన్నుపాటి రామకోటయ్య స్టేడియంలో గురువారం అభినందించారు. అండర్–14 టేబుల్ టెన్నిస్‌లో బాలుర సింగిల్స్ విభాగంలో ఎన్.ఋషీల్ రజతం, బి.హర్షిత కాంస్య పతకాలు, అండర్ –17 బాలికల సింగిల్స్ విభాగంలో పి.స్నేహిత రజతం, ఎం.తన్వి కాంస్యం పొందారన్నారు. అండర్–17 బాలుర సింగిల్స్ విభాగంలో పి.సత్య బంగారు పతకం పొందారని చెప్పారు. స్కూల్ గేమ్స్ టీమ్ ఈవెంట్‌లో టేబుల్ టెన్నిస్ అండర్–14 విభాగంలో హర్షిత, రుషిల్, లోహిత్ బంగారు పతకం, అండర్–14 బాలికల విభాగంలో ఐశ్వర్య, ఉజ్వల కాంస్య పతకం సాధించారన్నారు. అండర్–17 బాలికల విభాగంలో సంహిత, తన్వి అండర్–17 బాలికల విభాగంలో పి.సత్య, పి.ఉపేంద్ర రజత పతకాలు సాధించారన్నారు



పతకాలు పొందిన విద్యార్థులు

బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్యవారు స్పెషల్ సెక్రటరీ భరత్‌గుప్తాకు గురువారం వినతిపత్రం అందజేశారు. సమాఖ్య అధ్యక్షుడు సత్యవాడ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం బ్రాహ్మణ కార్పొరేషన్ పనితీరు, బడ్జెట్, పథకాల అమలు, వేదవ్యాస స్కీంను అమ్మవడి ద్వారా అమలుపర్చుట, బ్రాహ్మణ భవనానికి భూమి కేటాయింపు, ధూపదీప నైవేద్యం సొమ్ము పెంపుదల మొదలైన సమస్యలను వినతి పత్రంలో పేర్కొన్నారు. స్పెషల్ సెక్రటరీ భరత్‌గుప్తా స్పందించారని, సమస్యలను సీఎంకి వివరించి అతి త్వరలో అన్ని బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో సమాఖ్య గౌరవ అధ్యక్షుడు యామిజాల నరసింహమూర్తి, తెలికేపల్లి వెంకటేశ్వర్లు, డాక్టర్ యడవల్లి శ్రీనివాసశర్మ, పురాణంశేషు ఉన్నారు.



స్పెషల్ సెక్రటరీ గుప్తాకు వినతిపత్రం అందజేస్తున్న బ్రాహ్మణ సేవా సంఘ ప్రతినిధులు

16 నుంచి కొమ్మినేని జిల్లాల పర్యటన

ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రచారం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, యువత మొదలైన వర్గాల వారు ప్రభుత్వం నుంచి పొందిన ప్రయోజనాలపై ఆయా వర్గాలతో పాటుగా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు సమగ్ర సమాచారం ఇవ్వడం కోసం ఈ నెల 16 తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా తాను పర్యటించనున్నామని సి.రాఘవాచారి మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ గా తాను బాధ్యతలు చేపట్టి సంవత్సరం పూర్తి అయ్యిందని, ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన పాలనా సంస్కరణలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పరిశ్రమల స్థాపన వంటి అంశాలపై పూర్తి సమాచారాన్ని ప్రచారం చేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. ఈ పర్యటనల్లో భాగంగా పాత్రికేయలతో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ నెల 16 తేదీ నుంచి రాయలసీమలోని కర్నూలు, పుట్టపర్తి, అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో తాను పర్యటిస్తానని కొమ్మినేని శ్రీనివాసరావు వివరించారు.